కడుపు నింపని 'ఉపాధి'

- కూలీలకు గిట్టుబాటుకాని వేతనం
- ఆదుకోని డబుల్ ఇంజిన్ సర్కారు
- వలసబాట పట్టిన పల్లె జనం
- మండలంలో 15 గ్రామాలకు పైగా వలస
- పెసలబండ గ్రామం ఖాళీ


టెంపోలో లగేజీ వేసుకుని వలస వెళ్లేందుకు సిద్ధమైన పెసలబండ కూలీలు

ఆదోని రూరల్: స్థానికంగా గిట్టుబాటు వేతనం రాక పోవడంతో కూలీలు ఇతర ప్రాంతాలకు వలస బాట పట్టారు. కూలీలకు ఉన్న చోటే పనులు కల్పించాలన్న ఉద్దేశంతో అప్పటి యూపీఏ ప్రభుత్వం మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే కాలానికి అనుగుణంగా నిత్యావసర ధరలు ఆకాశాన్ని తాకడంతో కూలి గిట్టుబాటు కాక పోవడంతో కుటుంబాలు బతకడమే గగనమైపోయింది. ఈ తరుణంలో ఎన్నికలకు ముందు ఎన్డీఏ కూటమి తాము ఎన్నికల్లో గెలిస్తే ఉపాధి కూలీలకు వేతనం పెంచుతామని హామీ ఇచ్చి ఓట్లను దండుకుంది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు కావొస్తున్నప్పటికీ వేతన పెంపు ఊసెత్తడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో కూలీలకు వలసబాట పట్టక తప్పడంలేదు.

గిట్టుబాటుకాని కూలి

ప్రస్తుతం కనీస వేతనం రూ.250 నుంచి రూ.300 లోపే వచ్చేలా క్యూబిక్ మీటర్ ప్రకారం పనులు కల్పించడం జరుగుతోంది. ఒకే కుటుంబంలో ఇద్దరు కలిసి పని చేస్తే ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ.300 కూడా వేతనం రాకపోవడంతో కుటుంబాన్ని పోషించుకోలేక అనేక ఇబ్బందులు పడుతూ అప్పుల పాలవుతున్నారు. ఈ తరుణంలో తాము జీవించడానికి, పిల్లల చదువులు, వయస్సుకు వచ్చిన పిల్లల పెళ్లిళ్లు చేసేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు వరుణదేవుడు కరుణించక పొలాల్లో పంటలు సరిగా పండకపోవడంతో స్థానికంగా వ్యవసాయ పనులు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. దీంతో కూలీలు ఇతర ప్రాంతాలకు ఈ సీజన్‌లో వలస వెళ్లి పనులు చేసుకుంటే కనీసం నాలుగు రూపాయలు సంపాదించుకుని కుటుంబాలను పోషించుకోవడంతో పాటు పిల్లల పెళ్లిళ్లు, ఇతర కార్యక్రమాలు చేసుకోవచ్చన్న ఉద్దేశంతో రైతు కూలీలు, వ్యవసాయ కూలీలు పిల్లాపాపలతో కలసి వలసబాట పడుతున్నాయి.

ఒక్కరోజే 60 కుటుంబాలు వలస

జిల్లాలోని పశ్చిమప్రాంతమైన ఆదోని డివిజన్ వర్షాధారంపైనే ఆధారపడి పంటలను సాగుచేస్తారు. వరుణుడు కరుణించకపోవడంతో బతకలేని పరిస్థితుల్లో ప్రజలు వలసబాట పట్టారు. డివిజన్ కేంద్రమైన ఆదోని మండలంలో 44 గ్రామాలు ఉండగా, 37 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో దాదాపు ఇప్పటికే 15 గ్రామాలు బెంగళూరు, తెలంగాణ, రాయచూర్, చెన్నై, ముంబాయి ప్రాంతాలకు వలస వెళ్లారు. తాజాగా ఆదివారం ఆదోని మండలంలోని పెసలబండ గ్రామంలో దాదాపు 60 కుటుంబాలకు పైగా మినీ లారీల్లో మూటాముల్లా సర్దుకుని, పిల్లాపాపలతో వలసబాట పట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమను ఆదుకోకపోవడంతోనే వలస వెళ్లాల్సి వస్తోందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

37 గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులు కల్పిస్తున్నాం



వ్యవసాయ కూలీలు, రైతు కూలీలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా స్థానికంగానే పనులు కల్పిస్తున్నాం. మండలంలో 44 గ్రామాలు ఉండగా, 37 గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులను చేపట్టాం. కూలీలు అదనపు వేతనాన్ని ఆశించి ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారు. ప్రభుత్వం కనీస వేతనం కింద రోజుకు క్యూబిక్ మీటర్ పనికి రూ.200 నుంచి రూ.250 వరకు వేతనం చెల్లిస్తుంది. కూలీలకు ఉపాధి పనులపై అవగాహన కల్పిస్తున్నాం.
–ఖాలిక్, ఏపీఓ

కూలి గిట్టుబాటు కావడం లేదు



నేను, నా భార్య ప్రతిరోజూ ఉపాధిహామీ పనికి వెళ్లేవారం. ప్రభుత్వ కొలతలు, నిబంధనల ప్రకారం పనులు చేసినా రోజుకు రూ.300 కూడా పడటంలేదు. వేతనం డబ్బులు కూడా వారం లేదా రెండు వారాలకు ఖాతాల్లో జమ అవుతోంది. ఈ మధ్య కాలంలో కుటుంబాన్ని నడుపుకోవడం కష్టతరంగా మారింది. అందుకోసం ఇతర ప్రాంతాలకు వెళ్తే రోజువారీగా గిట్టుబాటు వేతనం వస్తుందని వెళ్తున్నాం. –కోడుమూరు రాఘవేంద్ర, పెసలబండ గ్రామం

ఉపాధి కూలీల వేతనం పెంచాలి



భార్య, పిల్లలతో కలిసి ఉపాధి పనుల్లో పాల్గొంటున్నాం. భార్య, పిల్లలు, తాను కలిసి పనిచేసినా రూ.600 కూలీ ఉపాధి కూలీ రావడం లేదు. బతికేందుకు చాలా ఇబ్బందికరంగా ఉంది. దీంతో కర్ణాటక ప్రాంతానికి వలస వెళ్తున్నాం. ప్రభుత్వాలు స్పందించి ఉపాధి కూలీలకు గిట్టుబాటు వేతనం పెంచాలి. – బజారి, ఉపాధి కూలీ పెసలబండ, గ్రామం

పిల్లలను పోషించుకునేందుకు



మాకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. మా ఊరిలో ముగ్గురు పిల్లలతో కలిసి కూలీ పనులకు వెళ్తే రోజుకు రూ.500 కూడా రావడం లేదు. తమతో పాటు పిల్లలను బతికించుకోవడం ఇబ్బందికరంగా ఉండడంతో కర్ణాటకకు వలస వెళ్తున్నాను. ఇక్కడ కనీసం కుటుంబాన్ని బతికించుకోలేని పరిస్థితి నెలకొంది. – ఉరుకుందమ్మ, ఉపాధి కూలీ, పెసలబండ గ్రామం

బహిరంగ సభను విజయవంతం చేద్దాం


అభివాదం చేస్తున్న ఎంఈఎఫ్ నాయకులు

ఆదోని రూరల్: కర్నూలులో నవంబర్ 5వ తేదీన జరిగే మందకృష్ణ మాదిగ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎంఈఎఫ్ నాయకులు జీ.సి. సుబ్బరాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో నియోజకవర్గ స్థాయి నాయకుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల మాదిగ నాయకులు, మాదిగ కుటుంబాలు పెద్ద ఎత్తున కర్నూలులో జరిగే భారీ బహిరంగ సభలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ జాతీయ నాయకులు బుచ్చర్ల నరసింహులు మాదిగ, నంద్యాల ఎంఎస్ జిల్లా అధ్యక్షుడు శేషు మాదిగ, ఆదోని ఎంఈఎఫ్ నాయకులు రాజేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు నాగప్ప, జగన్, నరసింహులు, లక్ష్మణరావు, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

హొళగుంద: దేవరగట్టులో ఆదివారం మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ, పూజలు జరిగాయి. పూజారులు మూల విరాట్‌లకు తెల్లవారు జామున సుప్రభాత సేవ, అభిషేకాలు, బండారార్చన, కుంకుమార్చన, మహామంగళ హారతి, నైవేద్య సంతర్పణ శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చారు. వారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వాహకులు అన్నదానం చేపట్టారు.

క్లుప్తంగా

విద్యుత్ స్తంభాల ఏర్పాటు


విద్యుత్ స్తంభానికి తీగలు బిగిస్తున్న దృశ్యం

కోసిగి: మండల పరిధిలోని నేల కోసిగి గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయించినట్లు గ్రామ సర్పంచ్ పశువుల హనుమంతమ్మ తెలిపారు. ఆదివారం గ్రామంలో స్తంభాలు లేక అంధకారంలో ఉన్న కాలనీల్లో కొత్త స్తంభాలు ఏర్పాటు చేయించారు. కొత్తగా 20 స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ లైన్ లాగి విద్యుత్ బల్బులు వేయిస్తున్నామని చెప్పారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు

నందవరం : వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. ఆదివారం మండల పరిధిలోని ముగతి సర్కిల్‌లో ఆటో డ్రైవర్లు, వాహనదారులకు రోడ్డు సేఫ్టీ నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనదారులు ఓవర్ లోడ్‌తో వెళ్లరాదని, వాహనాలకు సంబంధించి డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ధ్రువపత్రాలను వద్ద ఉంచుకోవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరి హెల్మెంట్ ధరించాలన్నారు. ఓవర్ లోడ్‌తో వెళ్లితే జరిమానాలు తప్పవని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఆదోని రూరల్: మండలంలోని కడితోట గ్రామ సమీపంలో శనివారం రాత్రి స్కూటర్‌ను ఆటో ఢీకొట్టడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన చోటు చేసుకుంది. పెద్దతుంబళం ఎస్ఐ మహేష్‌కుమార్ తెలిపిన మేరకు వివరాలు .. కోసిగి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ అశోక్ ఆదోని నుంచి కోసిగికి వెళ్తున్నాడు. అదే సమయంలో ఆదోని పట్టణం కల్లుబావికి చెందిన హరి బైకుపై పెద్దతుంబళంవైపు వెళ్తున్నాడు. మండలంలోని కడితో వద్దకు రాగానే ఆటో స్కూటర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హరి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఆదోని జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ముగిసిన ఆర్‌యూ అంతర్ కళాశాలల పోటీలు


ట్రోఫీ అందుకుంటున్న ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జట్టు

కర్నూలు (టౌన్): కర్నూలు నగరంలోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న రాయలసీమ యూనివర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి కళాశాల కరెస్పాండెంట్ వై.శౌరీలు రెడ్డి, ప్రిన్సిపాల్ శాంత, యూనివర్సిటీ కో–ఆర్డినేటర్ శివకిషోర్ హాజరయ్యారు. విజేతలకు కప్పు, మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీవన శైలిలో క్రీడలను భాగంగా చేసుకోవాలన్నారు.

విజేతల వివరాలు :

సెపక్‌తక్రా క్రీడాంశంలో ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జట్టు విన్నర్స్, కర్నూలు సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాల జట్టు రన్నర్స్, రాయలసీమ యూనివర్సిటీ జట్టు మూడవ స్థానంలో నిలిచాయి. అలాగే వాలీబాల్ క్రీడాంశంలో కర్నూలు రామకృష్ణ డిగ్రీ కళాశాల జట్టు విన్నర్స్, రాయలసీమ యూనివర్సిటీ జట్టు రన్నర్స్, పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు మూడవ స్థానంలో నిలిచాయి.

31న సద్గురు సర్కార్ స్వామి ఆరాధన

ఆదోని సెంట్రల్: శ్రీ సద్గురు సర్కార్ స్వామి వారి 96వ ఆరాధన మహోత్సవ కార్యక్రమం ఈ నెల 31న జరుగుతుందని యల్లమ్మ మణ్‌కార్ రమేష్ ఫ్యామిలీ ట్రస్ట్ నిర్వాహకులు ఆదివారం తెలిపారు. పట్టణంలోని మరాఠవాడిలో ఉన్న పాపమ్మ మఠంలో పాపమ్మ వారి గురువర్యులు సద్గురు స్వామి వారి ఆరాధన ఎప్పటిలాగే ఈ సంవత్సరం కూడా జరుగుతుందన్నారు. 31వ తేదీ గురువారం ఉదయం 5 నుంచి 9 గంటల వరకు అభిషేకము, పూజ, అర్చన, నైవేద్యాధి తీర్థ ప్రసాద సేవా కార్యక్రమాలు ఉంటాయన్నారు. 11 గంటలకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. రాత్రి 7 గంటలకు భక్తితత్వకార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కంటి సమస్యలపై నిర్లక్ష్యం వద్దు


కంటి వైద్య పరీక్షలు చేస్తున్న కంటి వైద్య నిపుణుడు

ఎమ్మిగనూరుటౌన్: ప్రతి ఒక్కరు కంటి సమస్యలపై నిర్లక్ష్యం వీడాలని ప్రముఖ కంటి వైద్య నిపుణులు అడిమి నాగ వంశీకృష్ణ సూచించారు. పట్టణంలోని పద్మశాలి కల్యాణ మండపంలో ఆదివారం మార్కండేయ యూత్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో వంద మందికి పైగా కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు ఉదయం నుంచి రాత్రి వరకు సెల్‌ఫోన్‌లు, టీవీలు చూడటం పెరిగిపోయిందన్నారు. దీంతో కళ్లపై తీవ్ర ప్రభావం చూపి సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మార్కండేయ యూత్ నాయకులు అడిమి నవీన్‌కుమార్, కాకర్ల అరుణ్, శ్రీనివాసులు, తాటికొండ హరిబాబు పాల్గొన్నారు.

పంట మార్పిడితో ఉత్తమ ఫలితాలు


గోనెగండ్లలో దుక్కి దున్నుతున్న రైతు

గోనెగండ్ల : ఒకే పొలం ఒకే రకమైన పంట ఏటా ఇదే పద్ధతిలో సాగు చేయడం ద్వారా దిగుబడులు తగ్గిపోతున్నాయని, పైరు ఎదుగుదల లోపించి చీడపీడల ఉధృతి అధికంగా ఉండడంతో దిగుబడి అంతంత మాత్రంగానే వస్తోందని ఎమ్మిగనూరు ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ తెలిపారు. పంట మార్పిడి చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఆయన మాట్లాడుతూ.. ఒకే పొలంలో వేర్వేరు పంటలను ఒక క్రమంలో సాగుచేస్తే అధిక ప్రయోజనాలు ఉంటాయని చెబుతున్నారు. పంట మార్పిడితో ప్రకృతి వనరులను సమర్థవంతంగా వాడుకోవచ్చని, తక్కువ పెట్టుబడితో భూసారానికి ఇబ్బంది లేకుండా అత్యధిక లాభంపొందే అవకాశం ఉందంటున్నారు. వరి పంటకు ప్రత్యామ్నాయంగా ఉలవలు, రాగులు సాగుచేస్తే భూమి సారవంతంగా మారుతుంది. అలాగే భూమిలో జనుము కట్టెలు వేసి బాగా దున్నితే సేంద్రియ ఎరువు తయారవుతుందని చెప్పారు. దీని వలన రసాయన ఎరువుల ఖర్చు తగ్గుతుందని వెల్లడించారు.


మహమ్మద్ ఖాద్రీ, ఏడీఏ

ఒకే పంటతో నష్టం

రైతులు ఏటా రబీ సీజన్‌లో అధిక శాతం ఒకే పంటను సాగు చేస్తున్నారన్నారు. చలికి పండే పంటలైన మొక్కజొన్న, వేరుశనగ వంటి పంటలు తప్ప మరే పంటలు సాగు చేయడం లేదని తెలిపారు. దీంతో చీడల బెడద ఎక్కువై సాగు ఖర్చులు పెరుగుతున్నాయని, దిగుబడులపై ప్రభావం చూపుతుందన్నారు. దీనిని నివారించేందుకు పంట మార్పిడి విధానం ఉత్తమమన్నారు. పంట మార్పిడి వల్ల కలిగే ప్రయోజనాలపై వ్యవసాయ అధికారులు, సిబ్బంది గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి

కర్నూలు సిటీ: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి విమర్శించారు. స్థానిక సలాంఖాన్ భవనంలో ఆదివారం ఎస్టీయూ జిల్లా కార్యవర్గ తృతీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలే శరణ్యం అని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేస్తుందన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు దాటిందని, రాష్ట్రంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని, వాటిని పరిష్కరించడంలో చొరవ చూపడం లేదన్నారు. 12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించి, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలన్నారు. యువగళం పాదయాత్రలో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి లోకేష్ జీఓ ఎం.ఎస్ నెంబరు 117ను రద్దు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని, సీపీఎస్/జీపీఎస్‌లను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.21 వేల కోట్ల బకాయిలను మంజూరు చేయాలని, జీఓ 84ను సవరించాలని, బదిలీలకు, పదోన్నతులకు శాశ్వత కోడ్ చట్టాన్ని రూపొందించాలన్నారు. ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, నాగరాజు, సుంకన్న, రామ్మోహన్ రెడ్డి, బసవరాజు, ప్రసన్నరాజు, నాగేంద్రప్ప, దేవదాస్, రమేష్, సుధీర్, ముదాసీర్ అహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ పోటీలు

కర్నూలు (టౌన్): కర్నూలు నగరంలోని పాతబస్టాండ్ కొండారెడ్డి బురుజు సమీపంలోని పార్కులో ఆదివారం తైక్వాండో చిన్నారులకు బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు కార్పొరేటర్ అబ్దుల్ లతీఫ్ బెల్టులు ప్రదానం చేశారు.

ప్రజలపై విద్యుత్ చార్జీల భారం తగదు


మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపుతున్నాయని, ప్రభుత్వాల విధానాలపై పోరాటం చేసేందుకు ప్రజలు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. డిసెంబర్ 29, 30 తేదీల్లో నిర్వహించే సీపీఎం జిల్లా మహాసభల ఆహ్వాన సంఘ సన్నాహక సమావేశాన్ని ఆదివారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు గోవిందు అధ్యక్షతన నిర్వహించారు. ఆయనతో పాటు జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయక ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. రామమందిరం పేరుతో ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన బీజేపీ రామ మందిరం నిర్మించిన అయోధ్యలోనే ఓడిపోయిందని గుర్తు చేశారు. మతాన్ని బట్టి ఓట్లు పడవని బీజేపీ గుర్తుంచుకోవాలని హితవుపలికారు. ఇదేవిధంగా రాష్ట్రంలో అధికారంలో వచ్చిన కూటమి ప్రభుత్వం కూడా అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చి నేడు ప్రజలపై రూ.వేల కోట్ల విద్యుత్ చార్జీల భారం మోపేందుకు నిర్ణయించుకుందన్నారు. ప్రభుత్వం నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సీపీఎం జిల్లా మహాసభల ఆహ్వాన కమిటీని ఎంపిక చేశారు. సమావేశంలో జిల్లా నాయకులు రామాంజినేయులు, రాధాకృష్ణ, వెంకటేశ్వర్లు, గురుశేఖర్, ఆనంద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పూర్వ ఉపాధ్యాయులతో నాటి విద్యార్థులు

మంత్రాలయం: అదో అపూర్వ కలయిక. పాతికేళ్ల క్రితం ఒకే చదువులమ్మ చెట్టు నీడలో పాఠాలు నేర్చి ఎక్కడెక్కడో స్థిరపడి వారంతా కలుసుకున్న పర్వమిది. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్న తరుణం. మంత్రాలయం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థుల అపూర్వ సమ్మేళనానికి వేదికైంది. ఆదివారం స్థానిక పాఠశాలలో 1997–98 బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ వేడుకలో ఆనాటి ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు కలుసుకున్నారు. ఒకరి అనుభవాలు ఒకరు పంచుకుని ఆనందంగా గడిపారు. పూర్వ ఉపాధ్యాయులను సన్మానించి వారి ఆశీర్వాదం తీసుకున్నారు.


ఓబుళాపురంలోని ప్రధాన వీధి దుస్థితి


వీధిలో రోడ్డు వెంట ప్రవహిస్తున్న మురుగునీరు


ఆంజనేయస్వామి దేవాలయం వద్ద నిలిచిన మురుగునీరు

మురుగంతా రోడ్లపైనే

- ఓబుళాపురంలో డ్రైనేజీ వ్యవస్థ లేక ఇక్కట్లు
- ఏ వీధిలో చూసినా దుర్గంధమే
- రోగాలబారిన పడుతున్న ప్రజలు

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద పంచాయతీకి మజరా గ్రామంగా ఉన్న ఓబుళాపురంలో ఎటూ చూసినా మురుగు నీరు రోడ్లపైనే ప్రవహిస్తూ తిరగడానికి కూడా వీలు లేకుండా ఉంది. ఆంజనేయస్వామి ఆలయం నుంచి ఉన్న ప్రధాన వీధి, వాల్మీకి వీధి ఇలా ఏ వీధి చూసిన మురుగు నీరే. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడమే దీనికి ప్రధాన కారణం అని గ్రామస్తులు లక్ష్మిరెడ్డి, సిద్ధప్ప, ఈరన్న, శివ తదితరులు తెలిపారు. ఇళ్ల ముందు మురుగు నీరు నిల్వ ఉండడంతో దుర్వాసనతో అంటూ రోగాలు వస్తున్నాయని మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలు గ్రామంలో సాధరణమయ్యాయని వాపోతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ వారికి ఎన్నిసార్లు విన్నపించుకున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి పూట దోమల బెడద విపరీతంగా ఉంటుందని, గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేసి మురుగు నీరు డ్రైనేజీల్లో పారే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డ్రైనేజీలను ఏర్పాటు చేయాలి



గ్రామంలో డ్రైనేజీలను ఏర్పాటు చేసి రోడ్డు మధ్యలో మురుగు నీరు పారకుండా చూస్తే చాలు. మురుగు నీరు రోడ్డుపై పారుతుండడంతో నడవడానికి కూడా వీలు లేకుండా ఉంది. ఈ విషయంపై పంచాయతీ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.
– లక్ష్మిరెడ్డి